క్లుప్తంగా

సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ



తహసీల్దార్ శ్రీకాంత్‌ను అభినందిస్తున్న రేషన్ డీలర్లు

మందస: జూన్ నెల నుంచి లబ్ధిదారులకు రేషన్ సరుకులను డిపోల వద్ద సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ మిస్కా శ్రీకాంత్ డీలర్లకు సూచించారు. రేషన్ డీలర్లతో తన కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరుకులు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్‌ను డీలర్లు పుష్పగుచ్ఛంతో అభినందించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కె.రామకృష్ణ ఉన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా ఖాన్‌అబ్దుల్



కవిటి: మండలపరిషత్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎంపీడీవో పోస్టులో ఆర్.కరాపాడు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శి ఖాన్ అబ్దుల్‌కు పూర్తి అదనపు బాధ్యతలను కట్టబెడుతూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ విషయాన్ని ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు మంగళవారం తెలిపారు.

పెంటపోలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు తదితరులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పదోవార్డు పెంటవీధి, పొందరవీధిలో వెలసియున్న పెంటపోలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు జూన్ 6 నుంచి పదో తేదీ వరకూ జరగనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కాశీబుగ్గ పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ వెంకటఅప్పారావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, కమిటీ సభ్యులు పెంట సంజీత్, రూప్ సుందర్, విజయ్, ఉమాకాంత్, శివ, రాజేందర్ తదితరులున్నారు.

శరీర సౌష్టవ పోటీల్లో అవినాష్ ప్రతిభ



వెండి పతకంతో అవినాష్

మందస: హరిపురం గ్రామానికి చెందిన కొండ అవినాష్ శరీర సౌష్టవ పోటీల్లో సత్తాచాటారు. జాతీయ స్థాయిలో అండమాన్ ఐలాండ్ పోర్ట్ బ్లెయిర్‌లో జరిగిన మిస్టర్ అండమాన్ హంట్-4 విభాగంలో 165 హైట్ కేటగిరీలో రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఏ-1 ఫిట్‌నెస్ జిమ్ కోచ్ శివ మహరణ, కోట శ్రీకాంత్, బ్రహ్మ తదితరులు అవినాష్‌ను అభినందించారు.

మస్టర్ వేయడం లేదని ఫిర్యాదు

టెక్కలి రూరల్: ఉపాధి హామీ పథకం పనులకు ఆదివారం మినహా మిగిలిన రోజులు వెళ్తున్నప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.మల్లేష్ వారంలో మూడు, నాలుగు రోజులు మాత్రమే మస్టర్ వేస్తున్నాడని కోటబొమ్మాళి మండలం పాకివలసకు చెందిన వేతనదారుడులు దండాసి సింహాచలం దంపతులు అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ కోటబొమ్మాళి ఏపీఓ హరిప్రసాద్, మండల పరిషత్ ఏవో మంగరాణికి వినతిపత్రాలను అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం



రామారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, విశ్రాంత ఆర్మీ సుబేధార్ గొరకల రామారావు గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రామారావు మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. పెద్ద మురహరిపురం సచివాలయ కన్వీనర్‌గా, సైనిక సేవా సమితికి అధ్యక్షునిగా విశేష సేవలందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు తిర్రి రాజారావు, పలాస మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఇల్లా మన్మధరావు ,బంగార తాతయ్య తదితరులు రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శిథిల భవనాల్లో.. భయం భయంగా..!



శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ కార్యాలయం



ఎంపీడీవో కార్యాలయాన్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాల భవనం

- శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాలు
- ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి
- భయాందోళనతోనే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- శిథిలావస్థకు చేరిన ఎంపీడీఓ కార్యాలయం, మానవ వనరుల కేంద్రం

నందిగాం: తెలుగునాట విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తీసుకువచ్చిన మండల వ్యవస్థలో భాగంగా నందిగాం మండలం ఏర్పాటైంది. అప్పట్లో ప్రజలకు అందుబాటులో సేవలు అందించేందుకు వీలుగా 1987లో మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. ఆ భవనం కొద్ది సంవత్సరాల క్రితమే శిథిలావస్థకు చేరుకుంది. అయితే నందిగాం ఎంపీపీగా నడుపూరు శ్రీరామమూర్తి ఎంపికైన తర్వాత మండల పరిషత్ కార్యాలయం నూతన భవనం నిర్మాణం చేయాలని భావించి 2021లో మండల తీర్మానం చేసి రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో జిల్లా పరిషత్ సీఈవోకు పంపించారు. అయితే నిధులు కేటాయించకపోవడం, శిథిల భవనంలో విధులు నిర్వహించే అవకాశం లేకుండాపోయింది. దీంతో పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న భవనాన్ని మండల పరిషత్ కార్యాలయంగా తాత్కాలికంగా మార్పు చేశారు. కానీ ఇప్పటి వరకు కార్యాలయం నూతన భవనాన్ని మాత్రం ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఇటీవల కార్యాలయాన్ని సందర్శించిన జెడ్పీ సీఈవో మరోసారి ప్రతిపాదనలు పంపించాలని సూచించగా అధికారులు మరోసారి ప్రపోజల్స్ పంపించారు. అలాగే స్థానిక మండల వనరుల కేంద్రం భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో చిన్న వర్షం కురిసిన పెకప్పు నుంచి నీరు కారి కంప్యూటర్లు తడిసిపోతున్నాయి. దీంతో కార్యాలయ పనులు చేయడానికి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నూతన భవనాల కోసం పలుమార్లు ప్రతిపాదనలు పంపిస్తున్నా నిధులు మంజూరు కావడం లేదు. తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. అధికారులు, నాయకులు స్పందించి శిథిలభవనం స్థానంలో నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వం చూడాలని ప్రజాప్రతినిధులు, మండలవాసులు కోరుచున్నారు.



శిథిలమైన మానవ వనరుల కేంద్రం



కూలడానికి సిద్ధంగా ఉన్న తహసీల్దారు కార్యాలయ భవనం

కార్యాలయం లేకపోవడం లోటే..



విశాలమైన మండలంగా పేరున్న నందిగాంకు మండల పరిషత్ కార్యాలయ భవనం లేకపోవడం లోటేగానే ఉంది. ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా వేరే చోటుకు మార్చి నెట్టుకొస్తున్నాం. జిల్లా పరిషత్ కార్యాలయానికి మరోసారి ప్రతిపాదనలు పంపించాము. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం చేయాలి.

– నడుపూరు శ్రీరామమూర్తి, ఎంపీపీ, నందిగాం

అమ్మవారికి నూతన ఛత్రం బహూకరణ



ఛత్రాన్ని కమిటీ సభ్యులకు అందజేస్తున్న దాతలు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని కంచమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కంచిలికి చెందిన కేలం ఈశ్వరరావు-శిరీష దంపతులు తమిళనాడు నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించిన నూతన ఛత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం బహూకరించారు. దీనికి ప్రత్యేక పూజలు చేసి ఆవిష్కరించారు. చెన్నై నుంచి అమ్మవారికి గొడుగును, బెంగళూరు నుంచి అమ్మవారి స్వర్ణాభరణాలు భద్రపరిచే పెట్టెను ప్రత్యేకంగా తయారు చేయించినట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఆర్టీసీ సేవలపై నమ్మకం కలిగించాలి



పార్సిల్ సేవలను వినియోగించుకున్న వారికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఈడీ బ్రహ్మానందరెడ్డి

టెక్కలి: ఆర్టీసీ సేవలపై ప్రయాణికులకు నమ్మకం కలిగించేలా మెరుగైన సేవలు అందజేయాలని ఈడీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. టెక్కలి డిపోను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిపో పరిధిలో అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బంది ఉత్తమ పనితీరుతో సంస్థను లాభాల బాటలో నడిపించాలని కోరారు. అనంతరం ఉత్తమ సేవలు అందజేసిన కండక్టర్లు పీవీకే రాజు, ఎస్.రాజు తదితరులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే ఆర్టీసీలో అత్యధికంగా పార్సిల్ సేవలను వినియోగించుకున్న వారికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఆర్ఎం ఎ.విజయకుమార్, పార్సిల్ ట్రాన్స్‌పోర్టు విభాగం అసిస్టెంట్ మేనేజర్ దివ్య, స్థానిక డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాశీబుగ్గ: పలాస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వరకు, ఫిష్ మార్కెట్, పోలీస్ స్టేషన్ ఏరియా, బ్రాహ్మణవీధి, పల్లివీధి, డెంకి వీధి, గాంధీనగర్ మొగిలిపాడు వరకు, బత్తులవీధి, కాపువీధి, ఉల్లాసపేట, ఉదయపురం, ఎమ్మార్వో ఆఫీస్, ఆర్డీవో ఆఫీస్, జి.జె.కాలేజ్ రోడ్డు, శాసనం, శివాజీనేజర్, సూదీకొండ, ఐటీఐ ఏరియా, రోటరీనగర్‌లో పరిసర ప్రాంతాలకు సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గ్రంథాలయానికి ఫ్యాన్లు వితరణ

నందిగాం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి జనసేన పార్టీ నాయకులు టి.కోటయ్య ఫ్యాన్లు, కుర్చీలను వితరణ చేశారు. గ్రంథాలయాధికారి ఉదయ్‌కిరణ్‌కు జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సమక్షంలో వీటిని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పి.రఘుపతి, బి.సింహాచలం ఉన్నారు.

నేటి నుంచి రామాలయ ఆలయ ప్రతిష్ఠ

కాశీబుగ్గ: పలాస మండలం జగన్నాథపురంలో ఈ నెల 28, 29, 30వ తేదీల్లో రామాలయ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మూడు రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా 30వ తేదీన మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేస్తామన్నారు.

టెక్కలిలో కుండపోత వర్షం

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో మంగళవారం కుండపోతగా వర్షం కురిసింది. సాయంత్రం ఆరు గంటలకు ఆరంభమైన వర్షం రాత్రి 8.30 గంటలు దాటిన వరకు పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పగలంతా ఎండతో ఇబ్బంది పడిన జనం వర్షంతో ఉపశమనం పొందారు.

వజ్రపుకొత్తూరులో..

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మండలంలో కూడా భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. ఖరీఫ్ పనులకు వర్షం ఉపకరిస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజలకు దూరంగా పోస్టల్ సేవలు!

- సొంత భవనానికి నోచుకోని వైనం
- అద్దె భవనంలోనే కాలక్షేపం
- దాత ఇచ్చిన స్థలం నిరుపయోగం



కవిటి గ్రామానికి శివార్లో అద్దెభవనంలో నడుస్తున్న పోస్టల్ కార్యాలయం

కవిటి: పోస్టల్‌శాఖ కార్యాలయాలు ఇప్పటికీ చాలాచోట్ల అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కవిటి మండలంలోని కవిటి, మాణిక్యపురం గ్రామాల్లోని సబ్‌పోస్టాఫీసులకు కూడా సొంత భవనాల్లేక అద్దెకొంపల్లోనే నడుస్తున్నాయి. కవిటి ఎస్‌వోకు డి.గొనపపుట్టుగ, కపాసుకుద్ది, రాజపురం, జగతి, బెజ్జిపుట్టుగ, శిలగాం బ్రాంచి పోస్టాఫీసులు, మాణిక్యపురానికి బిగొనపపుట్టుగ, కుసుంపురం, బొరివంక, తలతంపర, ఇస్కలపాలెం బ్రాంచి ఆఫీసులు అనుబంధంగా ఉన్నాయి. వాస్తవానికి కవిటి సబ్‌పోస్టాఫీసు భవన నిర్మాణానికి ఏడు దశాబ్దాల క్రితమే అప్పటి సర్పంచ్ బెందాళం పట్టాభిరామయ్య విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. అయితే ఈ స్థలంలో ఇప్పటికీ సొంత భవనం నిర్మాణానికి పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు ఆసక్తి చూపకపోవడంతో ఖాళీగానే ఉంది. దీంతో అద్దె భవనాల్లోనే పోస్టల్ కార్యాలయం నడుస్తోంది. తాజాగా గ్రామం మధ్యలో అద్దెకు కూడా భవనం లభ్యం కాకపోవడంతో గ్రామానికి శివార్లో ఉన్న అద్దె భవనంలోకి మార్పు చేశారు. ఇది ఎవరికీ అందుబాటులో లేదు. అవసరమైన వారు ఓ పూట పనిమానుకొని ఇక్కడకు వెళ్లాల్సి వస్తుంది. చిన్న మొత్తాల పొదుపు కార్యాకలాపాల నిర్వహణలో పోస్టాఫీస్ సేవలు కీలకమైన తరుణంలో కవిటిలో ప్రజలకు దూరంగా ఈ కార్యాలయం నిర్వహణ సంస్థ ఆర్థిక ప్రయోజనాలకు నష్టం కలిగించేదిగా మారిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా తపాలాశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి దాత ఇచ్చిన స్థలంలో సొంత భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



కవిటి పట్టణం మధ్యలో ఇప్పటి వరకూ నిర్వహించిన సబ్‌పోస్టాఫీస్ భవనాన్ని సంబంధిత యజమాని ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకే గ్రామానికి శివార్లోని భవనంలోకి కార్యాలయాన్ని మార్పుచేసి సేవలు అందిస్తున్నాం. కవిటి పెద్దల సహాయంతో స్థానిక ఎమ్మెల్యే అశోక్ దృష్టికి పోస్టల్ కార్యాలయ భవన నిర్మాణ విషయాన్ని తీసుకెళ్లాం.

– ఎం.రామారావు, పోస్ట్‌మాస్టర్, సబ్‌ఆఫీస్,కవిటి

వృద్ధులకు అవస్థలే..



కవిటి బస్టాండ్ సమీపంలో ఉండే సబ్‌పోస్టాఫీస్ గ్రామ శివార్లలోకి మార్చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వృద్ధులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్నవారు దూరంగా ఉన్న ఈ కార్యాలయానికి నడిచి వెళ్లి రావడానికి అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి గ్రామస్తులకు అందుబాటులో ఉండేచోటుకు మార్పుచేయాలి.

– బడే రామకృష్ణ, సీహెచ్ కపాసుకుద్ది



ఖాళీగా ఉన్న దాత ఇచ్చిన స్థలం

అపూర్వ కలయిక..



వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. గ్రూపు ఫొటోలను తీసుకొని మురిసిపోయారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

పంపుల నాణ్యత పరిశీలన..



వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా రాయితీపై రైతులకు అందజేస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అగ్రోస్ మేనేజర్ హనుమంతు కూర్మారావు అన్నారు. మామిడిపల్లి గ్రామంలో ఐదుగురు రైతులకు ఉద్యానశాఖ ద్వారా అందజేసిన పిచికారీ పంపుల నాణ్యతను మంగళవారం పరిశీలించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయధికారి బి.నర్సింహమూర్తి, ఉద్యానశాఖ సహాయకురాలు రమణమ్మ పాల్గొన్నారు.

–సోంపేట

ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేశాయి..



టెక్కలి విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ జంగిల్ పెరిగినప్పటికీ ఆయా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదే మార్గంలో రోజూ ఏఈ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన జంగిల్‌ను తొలగించాలనే ఆలోచన లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పేరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

–టెక్కలి

హమ్మయ్య.. పిచ్చిమొక్కలను తొలగించారు..





కాశీబుగ్గలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జంగిల్ క్లియరెన్సుకు ముందు.. తరువాత..

సాక్షి ఎఫెక్ట్...

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను పిచ్చిమొక్కలు చుట్టుముట్టేశాయి. దీంతో తరచూ ప్రమాదాల సంభవిస్తున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ సమస్యపై 'టెర్రర్ పుట్టిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు' శీర్షికతో ఈ నెల 26వ తేదీన 'సాక్షి'లో కథనం వచ్చింది. దీనికి సంబంధిత అధికారులు స్పందించారు. పలాస విద్యుత్‌శాఖ ఎగ్జిగ్యూటీవ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు పర్యవేక్షణలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు చేపడతామన్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు



మెయిన్‌రోడ్డులోని కాలువను శుభ్రం చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

కంచిలి: మండల కేంద్రం కంచిలి, ఎస్.ఆర్.సి.పురం పంచాయతీ యంత్రాంగాల ఆధ్వర్యంలో కాలువల్లో పూడికతీత పనులను మంగళవారం ప్రారంభించారు. కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చేసి ప్రజలకు ఇబ్బందిగా మారేది. దీనిపై 'మురుగురోడ్డు' శీర్షికతో ఈ నెల 26వ తేదీన 'సాక్షి'లో కథనం వచ్చింది. దీనికి పంచాయతీ అధికారులు స్పందించారు. మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలో కంచిలి పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో డ్రైనేజీలో ఎస్.ఆర్.సి.పురం పంచాయతీ సర్పంచ్, కార్యదర్శుల ఆధ్వర్యంలో మంగళవారం పూడికలను తొలగించారు.

అమ్మవారికి నైవేద్యాల సమర్పణ



పూజలందుకుంటున్న కంచమ్మ తల్లి అమ్మవారు



అమ్మవారికి ప్రసాదాలను నివేదిస్తున్న భక్తులు

కంచిలి: కంచిలి ప్రజల ఆరాధ్య దైవమైన కంచమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలు జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వేడుకలకు అమ్మవారిని ఆహ్వానించడానికి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దత్తత గ్రామాలలో ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి ప్రీతిపాత్రమైన అట్టు, పాయసం ప్రసాదాన్ని తీసుకొచ్చి నైవేద్యంగా నివేదించారు. ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి నైవేద్యాన్ని అమ్మవారికి నివేదించి మొక్కులు చెల్లించుకున్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన సమాజం



కవిటిలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

కవిటి/కంచిలి/ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరూ రోజూ యోగాను నియమబద్ధంగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించవచ్చని అధికారులు అన్నారు. యోగాపై శిక్షణ కార్యక్రమాలను కవిటి ఎంపీడీవో కార్యాలయంలో, కంచిలిలోని జేఎంజే ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో, ఇచ్ఛాపురంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. యోగా, మెడిటేషన్‌పై యోగాశిక్షకులు ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కవిటిలో ఎంపీడీవో వి.విశ్వేశ్వరావు, కంచిలిలో మండలాభివృద్ధి అధికారి తిరుమలరావు, ఇచ్ఛాపురంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.